





కొమ్ములకు ప్లాస్టిక్ తొడుగులు ధరించిన ఎద్దు - వాడివాసల్ నుంచి ఎద్దులను వదులుతున్న యజమానులు

తొలి జల్లికట్టు రంకేసింది



ఎద్దులను అణచేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

తచ్చంకురిచ్చిలో ఉరకలేసిన పోట్లగిత్తలు



చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తమిళుల ప్రాచీన సాహస క్రీడగా పేరుగడించిన జల్లికట్టు పుదుకోట జిల్లా తచ్చంకురిచ్చిలో అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రంలో యేటా తొలి జల్లికట్టు తచ్చంకురిచ్చిలోనే ప్రారంభం కావడం ఆనవాయితీ. ఆ మేరకు తచ్చంకురిచ్చి విన్నేర్పు అన్నై ఆలయ వార్షిక ఉత్సవాలు, ఆంగ్ల సంవత్సరాది వేడుకలు సందర్భంగా ఈ జల్లికట్టు క్రీడను నిర్వహించారు. శనివారం ఉదయం 8 గంటలకు ఈ జల్లికట్టు క్రీడలు ప్రారంభమయ్యాయి. పుదుకోట జిల్లా కలెక్టర్ మెర్సీ రమ్యా స్వీయ పర్యవేక్షణలో ఈ క్రీడలు నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి, పర్యావరణ శాఖ మంత్రి సీవీ మెయ్యనాథన్ జెండా ఊపి ఈ క్రీడలను ప్రారంభించారు. తొలుత పోటీలో పాల్గొనేందుకు వచ్చిన యువకుల చేత జల్లికట్టు క్రీడలో పరుగులు తీసే ఎద్దులను ఉద్దేశపూర్వకంగా చిత్రహింసలకు గురిచేయబోమని, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విన్నేర్పు అన్నై ఆలయ పోట్లగిత్తను, మురుగన్ ఆలయ పోట్లగిత్తను వాడివాసల్ నుంచి విడిచిపెట్టారు. ఆ రెండు ఎద్దుల జోలికిపోకుండా వాటి ఇష్టానుసారం మైదానంలో పరుగులు తీసేందుకు అనుమతించారు. ఆ తర్వాత వాడివాసల్ నుంచి బయపడిన ఎద్దులను అణచడానికి యువకులు పోటీపడ్డారు. ఈ పోటీల్లో ఎద్దులను అణచిన వీరులకు బంగారు కాసులు, బైకులు, ఇనుప బీరువాలు, ప్లాస్టిక్ కుర్చీలు, ప్లాస్టిక్ మంచాలను ఒదజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎద్దులకు, యువక్రీడాకారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక పదునైన కొమ్ములున్న ఎద్దులకు అధికారులు ప్రత్యేకంగా ప్రత్యేకంగా రబ్బరు తొడుగులను ధరింపజేశారు. ఒక్కో ఎద్దును అణచడానికి పది నుంచి పదిహేను నిమిషాల సమయాన్ని కేటాయించారు. వాడివాసల్ నుంచి పరుగులు తీసిన ఎద్దులను అణచేందుకు యువకులు పోటీపడ్డారు. కొన్ని ఎద్దులు అణచడానికి వస్తున్న యువకులను కొమ్ములతో పొడిచేందుకు ప్రయత్నించాయి. వాటి నుంచి యువకులు చాకచక్యంగా తప్పించుకున్నారు. ఈ పోటీలకు ప్రత్యేకమైన వాడివాసల్, ప్రేక్షకులకు గ్యాలరీని అధికారులు ఏర్పాటు చేశారు. పోటీలు జరిగే ప్రాంతం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు సుమారు 500 మంది పోలీసులతో భద్రత కల్పించారు. వాడివాసల్‌కు చేరువగా గాయపడే యువకులను తరలించేందుకు అంబులెన్స్‌ను, ప్రాథమిక చికిత్సలందించేందుకు వైద్యులను సిద్ధం చేశారు. ఇదే విధంగా గాయపడిన ఎద్దులకు చికిత్సలందించటానికి వెటర్నరీ డాక్టర్లను కూడా ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మురుగేశన్, డీఎస్పీ వందితా పాండే పర్యవేక్షణలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులు తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించారు. ఈ పోటీలలో మదురై, తిరుచ్చి, రామనాథపురం, సేలం తదితర జిల్లాల నుంచి 750 ఎద్దులు పాల్గొన్నాయి. పుదుకోట, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, రామనాథపురం, సేలం, తూత్తుకుడి జిల్లాల నుంచి 250మంది యువకులు విచ్చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు ఈపీఎస్ కొత్త వ్యూహం

అప్పుడే 15 మంది అభ్యర్థుల ఎంపిక



చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కొత్త సంవత్సరంలో సరికొత్త వ్యూహంతో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయక మునుపే, కూటమిని పాత పార్టీలతో కొనసాగించాలా? లేక కొత్త పార్టీలను కలుపుకుని మెగా కూటమిని ఏర్పాటు చేయాలా? అనే విషయాలపై నిర్ణయాలను పక్కనబెట్టి అత్యంత వేగంగా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. ఆ మేరకు 15 లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. అంతటితో ఆగకుండా ఆ నియోజకవర్గాల్లో అభ్యర్థులకు మద్దతుగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం కూడా సాగించమంటూ పార్టీ శ్రేణులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. బీజేపీతో తెగతెంపులు చేసుకున్నప్పటి నుంచి ఈపీఎస్ పార్టీని కొత్త మార్గంలో పయనింపజేస్తున్నారని ఆ పార్టీలోని సీనియర్ నేతలు చెబుతున్నారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే బలమైన పార్టీలతో మెగా కూటమిని ఏర్పాటు చేసుకుని బరిలోకి దిగుతుందని ఈపీఎస్ పదే పదే ప్రకటిస్తూ వచ్చారు. అయితే ఊహించని విధంగా లోక్‌సభ ఎన్నికలకు అప్పుడే పార్టీని సిద్ధం చేసేందుకు వేగవంతమైన చర్యలు చేపడుతున్నారు. అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే మాత్రమే చేరే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే డీఎండీకే నేతలు చివరి క్షణంలో డీఎంకే కూటమిలో చేరినా ఆశ్చర్యపోనక్కరలేదని పేర్కొంటున్నారు. కనుక ఆ పార్టీ కూటమిలో చేరినా, చేరకపోయినా పార్టీకి ఎలాంటి నష్టం కలగదని ఈపీఎస్ భావిస్తున్నారు. మెగా కూటమిలో కొత్త పార్టీలు చేరే అవకాశం లేదని నిర్ణయానికి వచ్చిన ఈపీఎస్ ప్రస్తుతం 15 లోక్‌సభ నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థుల జాబితాను రహస్యంగా విడుదల చేశారు.

అభ్యర్థులు వీరే...: సౌత్‌చెన్నైలో డాక్టర్ జయవర్ధన్, సెంట్రల్ చెన్నైలో ఎస్ఆర్ విజయకుమార్, నార్త్ చెన్నైలో రాయపురం మనో, విరుదునగర్‌లో మాఫాయ్ పాండ్యరాజన్, సేలంలో సెమ్మలై, కోయంబత్తూరులో చంద్రశేఖర్, కరూరులో మాజీ మంత్రి విజయభాస్కర్, ఈరోడ్‌లో వి. రామలింగం, మదురైలో రాజ్‌సత్యన్, దిండుగల్‌లో కన్నన్, కృష్ణగిరిలో కేపీఎం సతీష్‌కుమార్, కల్లకురిచ్చిలో రాధాకృష్ణన్, తూత్తుకుడిలో షణ్ముగనాథన్ లేదా శరవణ పెరుమాళ్‌ను పోటీకి దింపనున్నట్లు ప్రకటించారు.

మిత్ర పక్షాలకూ కొన్ని...

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మిత్రపక్షాలకు ఈ నియోజకవర్గాలు మినహా తక్కిన నియోజకవర్గాల్లో కొన్నింటిని కేటాయించాలని ఆయన భావిస్తున్నారు. ప్రస్తుతం నూటికి నూరుశాతం అన్నాడీఎంకే పోటీ చేయనున్న ఈ 15 లోక్‌సభ నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించమని జిల్లా శాఖ నేతలకు, స్థానిక పార్టీ ప్రముఖులకు ఆదేశాలు జారీ చేశారు. డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేలా ప్రచారం సాగాలని కూడా సూచించారు. ప్రస్తుతం తాను ఎంపిక చేసిన అభ్యర్థులపై ఆయా నియోజకవర్గాల్లో వారికున్న ప్రజల మద్దతును కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి ఆ వివరాలతో తనకు ప్రతి నెలా నివేదిక కూడా పంపాలని ఈపీఎస్ ఆదేశించారు. ఈపీఎస్ ఇలా తమతో సంప్రదించకుండా అభ్యర్థులను ఎంపిక చేయడం చూసి పార్టీ సీనియర్ నేతలు విస్తుపోతున్నారు. ఇక కూటమిలో ఉన్న పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు పెంచే ప్రసక్తి లేదని కూడా ఈపీఎస్ చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు డీఎంకేతో ఢీకొనాలంటే కూటమిలో తక్కువ పార్టీలు ఉంటేనే మంచిదని ఆయన భావిస్తున్నారు. ప్రత్యేక ఓటు బ్యాంకు కలిగిన పార్టీలకు ఒకటి రెండు సీట్లకు మించి కేటాయించకూడదనే యోచనలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ స్థానాల్లో అన్నాడీఎంకే పోటీ చేస్తేనే జాతీయ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని ఈపీఎస్ విశ్వసిస్తున్నారు.





నందంబాక్కం సెంటర్‌లో చురుగ్గా ఏర్పాట్లు

నేడు ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు

- 30వేల మంది ప్రతినిధుల రాక
- విదేశీ సంస్థలతో అవగాహన ఒప్పందాలు



చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2030లోగా వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థికాభివృద్ధిని సాధించే దిశగా దేశవిదేశాల నుంచి పెట్టుబడులను సమీకరించి, కొత్త పరిశ్రమలను స్థాపించడమే ప్రధాన లక్ష్యంగా ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు ఆదివారం ఉదయం ప్రారంభమవుతోంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్ వేదిక కానుంది. ఈ సదస్సుకు అమెరికా, సింగపూర్, కొరియా, బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జర్మనీ, డెన్మార్క్ సహా 50 దేశాలకు చెందిన ప్రతినిధులు విచ్చేయనున్నారు. ఈ సదస్సులోనే పలు విదేశీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి. రాష్ట్రాన్ని 2030లోగా న్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక పురోగతిని సాధించిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ పలు సభల్లో ప్రకటించారు. ఆ లక్ష్యాన్ని సాధించేందుకే ఈ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్ల నడుమ నిర్వహించనుంది. పారిశ్రామిక రంగంలో వివిధ శాఖలకు పెట్టుబడులను సమీకరించడానికి ఈ సదస్సు దోహదపడుతుందని ఆయన తెలిపారు. అన్నాడీఎంకే హాయంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సుల కంటే ఎక్కువగా ఆకర్షించే రీతిలో భారీ ఏర్పాట్లతో ఈ సదస్సును నిర్వహించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, వివిధ శాఖలకు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ఈ సదస్సు ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ సదస్సును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆ తర్వాత టాన్‌ఫండ్ పథకాన్ని ప్రారంభించనున్నారు. అటుపిమ్మట సెమీకండక్టర్ల అధికోత్పత్తికి సంబంధించి కొత్త విధివిధానాన్ని విడుదల చేయనున్నారు.

30వేలకు పైగా ప్రతినిధులు

సదస్సులో పాల్గొనేందుకు దేశవిదేశాలకు చెందిన 30వేలకు పైగా ప్రతినిధులు పేర్లను నమోదు చేసుకున్నారు. సుమారు 450 మంది విదేశీ ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. అమెరికా, జపాన్, సింగపూర్ సహా 50 దేశాలకు చెదిన పారిశ్రామిక సంస్థల అధిపతులు, ప్రతినిధులు పాల్గొని రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలపై ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. కొత్త పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించనున్న సదుపాయాలపై రూపొందించిన దృశ్య శ్రవణ ప్రదర్శనలను కూడా ఆ ప్రతినిధులు తిలకించనున్నారు. సింగపూరు, కొరియా, బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ జర్మనీ, డెన్మార్క్, అమెరికా దేశాలు ఈ సదస్సు అధికారిక భాగస్వామ్య దేశాలుగా ఉండటం విశేషం. సుమారు 170మందికి పైగా ప్రతినిధులు 26 సమావేశాలలో పాల్గొని ప్రసంగించనున్నారు.

స్టాళ్ల ఏర్పాటు...

రిజర్వుబ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు అరవింద్ సుబ్రమణియన్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఛైర్మన్ సోమనాథ్ తదితర జాతీయ, అంతర్జాతీయ సంస్థల సీఈఓలు ప్రసంగించనున్నారు. ఈ సదస్సులోనే వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. చిన్న,మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) రాష్ట్ర పరిశ్రమల శాఖ, జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమల ఉత్పత్తులను తెలియజేసే స్టాళ్లు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో భారీ స్థాయిలో నిర్మించిన సదస్సు ప్రాంగణాలను అలంకరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

విజయవంతం...

ఆదివారం జరగనున్న పెట్టుబడిదారుల సదస్సు తప్పకుండా విజయవంతమవుతుందని, మునుపటి కంటే అధికంగా పెట్టుబడులను సాధించి తీరుతామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శపథం చేశారు. దేశవిదేశాలకు చెందిన 30 వేలమంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగని రీతిలో అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా ఈ సదస్సుకు విచ్చేయనున్నారని ఆయన తెలిపారు. స్టార్టప్ తమిళనాడు పేరుతో విశాలమైన స్టాల్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కదుర్చుకుని రాష్ట్రాన్ని పారిశ్రామికపరంగా అభివృద్ధిపరచనున్నామని ఆయన ప్రకటనలో వివరించారు.

అయోధ్య వెళ్లే భక్తులకు సాయం

- మంత్రి శేఖర్‌బాబు హామీ



చెన్నై ముత్యాలపేట బాలుర మహోన్నత పాఠశాలలో సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయ మహాకుంభాభిషేక వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లే భక్తులకు ప్రభుత్వపరంగా సాయం అందిస్తామని, ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చించి ప్రకటిస్తామని రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. స్థానిక తంబుశెట్టి వీధి ముత్యాలపేట మహోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే ద్రావిడ తరహా పాలనలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నామని, ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నామని, కబ్జాలకు గురైన కోట్లాది రూపాయల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుని ఆలయాలకు ఆర్థిక పరిపుష్టిని కలిగించామన్నారు. మునుపెన్నడూ లేని విధంగా రెండేళ్లుగా మార్గశిర మాసంలో ఆండాళ్ తిరుప్పావై పాశురాలను పాఠశాలల విద్యార్థుల చేత శ్రావ్యంగా గానం చేయిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 20 ఆలయాల్లో నిర్విరామంగా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. నిరుపేదలైన వృద్ధులు కాశీయాత్ర వెళ్లేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇదే రీతిలోనే ప్రస్తుతం అయోధ్య రామాలయ మహాకుంభాభిషేకానికి వెళ్లే తమిళ భక్తులకు తగు సాయం చేయాలని భావిస్తున్నామని, ఈ విషయమై ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సంప్రదింపులు జరిపి ప్రకటన వెలువరిస్తామని మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు.

10నుంచి పొంగల్ కానుక వస్తువులు

నేటినుంచి ఇంటింటా టోకెన్ల పంపిణీ

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా రేషన్ షాపుల్లో బియ్యం కార్డుదారులకు రూ.1000 నగదు, పొంగల్ తయారీకి అవసరమయ్యే పచ్చిబియ్యం, చక్కెర, చెరకుగడ తదితర కానుకల పంపిణీకి ప్రజాపంపిణీ, సహకార శాఖ అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. ఈనెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 2.20లక్షల మంది బియ్యం కార్డుదారులకు ఈ పొంగల్ కానుకలను రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేయనున్నట్టు సీఎం స్టాలిన్ ప్రకటించారు. సీఎం ఆదేశాల మేరకు ప్రజాపంపిణీ, సహకార శాఖ, ఆహార భద్రతశాఖ అధికారులు రేషన్‌షాపులకు పచ్చిబియ్యం, చక్కెర, చెరకు గడలను తరలిస్తున్నారు. అదే సమయంలో రేషన్ షాపుల వద్ద పొంగల్ కానుకల పంపిణీ సమయంలో రద్దీని నివారించే దిశగా టోకెన్ల పద్ధతి పాటించనున్నారు. ఆదివారం రేషన్‌షాపు సిబ్బంది కార్డుదారుల ఇంటింటికీ వెళ్ళి టోకెన్లు పంపిణీ చేయనున్నారు. ఆ టోకెన్లలో పొంగల్ కానుకలు పంపిణీ చేయనున్న తారీఖు, సమయం తదితర వివరాలు ఉంటాయి. ఈ టోకెన్లను మూడు రోజులపాటు పంపిణీ చేయనున్నారు. అదే విధంగా పొంగల్ కానుకల పంపిణీ ఈనెల 13 లోగా పూర్తి చేయాలని రేషన్‌షాపుల నిర్వాహకులకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పొంగల్ కానుకలతోపాటు ఉచిత చీరలు, ధోవతులను కూడా అందించనున్నారు. రోజూ 300 నుంచి 500 మంది కార్డుదారులకు పొంగల్ కానుకలను పంపిణీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పొంగల్ కానుకలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయడానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్‌రూంకు కార్డుదారులు 1967 అనే హెల్ప్‌లైన్‌కు, 18004255901 అనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కాగా పొంగల్ నగదు, కానుకల పంపిణీ చేయనుండటంతో సెలవుదినమైన ఈనెల 12న రేషన్‌షాపులన్నీ పని చేస్తాయని అధికారులు తెలిపారు.

సమాచార దర్శిని

నేడు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన

ప్యారీస్, జనవరి 6: స్థానిక టి.నగర్‌లోని భారత్ కళాచార్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన జరగనుంది. గత 15 సంవత్సరాలుగా భారత్, విదేశాల్లో ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్న సాధన, భావన గొల్లపూడి నృత్యప్రదర్శన డాక్టర్ రత్నకుమారి ఆధ్వర్యంలో జరుగుతుందని, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు రామకృష్ణ తంగుటూరి ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు 'ఖేలో ఇండియా' ఎంపిక పోటీలు

ఐసిఎఫ్, జనవరి 6: రాష్ట్రంలో 'ఖేలో ఇండియా' యువకుల క్రీడా పోటీలు ఈ నెల 19 నుంచి 31వ తేది వరకు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఎంపిక పోటీలు సోమవారం జరగనున్నాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి పురుషులకు అథ్లెటిక్ 1,500 మీటర్లు, 2,000 మీటర్ల పరుగు, షాట్‌పుట్ తిరువణ్ణామలై జిల్లా స్టేడియంలో ఎంపికలు జరగనున్నాయి. క్రీడాకారులు 2005 జనవరి 1వ తేదీకి పైగా జన్మించినవారై ఉండాలి. ఆధార్, జనన, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

స్వయవృత్తులు ప్రారంభించే వారికి రుణాలు

ఐసిఎఫ్, జనవరి 6: స్వయవృత్తులు ప్రారంభించే వారికి రుణాలు అందిస్తామని చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హులకు రుణాలు అందజేసే శిబిరాలు ఈనెల 27వ తేది నుంచి నగరంలోని అన్ని మండలాల్లో జరగనున్నాయి. ఔత్సాహికులు వీటిలో పాల్గొని తగిన ఆధారాలు సమర్పించి రుణాల పొందవచ్చు.

11న ఉపాధ్యాయుల ఆందోళన

ఐసిఎఫ్, జనవరి 6 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 11వ తేది ఆందోళన చేపట్టనున్నారు. 30 అంశాలు ప్రస్తావిస్తూ వాటిని నెరవేర్చాలని గత అక్టోబరులో స్థానిక డీపీఐ ప్రాంగణంలో ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అందులో 12 డిమాండ్లు నెరవేర్చనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇప్పటివరకు వాటిని నెరవేర్చకపోవడంతో ఈనెల 11న అవే డిమాండ్లతో మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ విద్యా కార్యాలయాల సమీపంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల సంఘ సమాఖ్య తెలిపింది.

గంగైకొండ చోళపురంలో ఫీల్డ్ మ్యూజియం

ఐసిఎఫ్, జనవరి 6: గంగైకొండ చోళపురంలో ఫీల్డ్ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర పురావస్తు శాఖ పరిశోధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి. తవ్వకాలు జరిగే కీళడి, గంగైకొండ చోళపురం, వెంబకోట వంటి ప్రాంతాలతో పాటు కొత్తగా కాంగల్ నగరం, చెన్ననూర్, మరుంగూర్ ప్రాంతాల్లోనూ ఈ ఏడాది తవ్వకాలు చేపట్టనున్నారు. ఇదివరకే తవ్వకాలు జరుగుతున్న గంగైకొండ చోళపురంలో ఫీల్డ్ మ్యూజియం ఏర్పాటుకానుందని అధికారులు తెలిపారు.

రేపు కంచి పరమాచార్య ఆరాధన మహోత్సవం

ఐసిఎఫ్, జనవరి 6 కాంచీపురం శంకర మఠం 68వ పీఠాధిపతి జగద్గురు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 30వ వార్షిక ఆరాధన మహోత్సవం ఈనెల 8వ తేది జరగనుంది. శంకర మఠంలో మహా పెరియవాళ్ అధిష్టానంలో ఉదయం 7 గంటలకు రుద్ర ఏకాదశి, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 1 గంటకు స్వామికి మహా అభిషేకం, రాత్రి 7 గంటలకు బంగారు రథం ఊరేగింపు తదితర కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్‌లో సంక్రాంతి సంబరాలు

ప్యారీస్, జనవరి 6: తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ (టీటీపీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు స్థానిక సాలిగ్రామం ప్రసాద్ ల్యాబ్ ప్రాంగణంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ప్రముఖ గాయనీమణులు వేద, శ్రేయ ప్రార్థనాగీతంతో సంబరాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పిల్లలు, మహిళలకు రంగోలి, ఫ్యాషన్ షో, మ్యూజికల్ చైర్ పోటీలుంటాయి. అదే విధంగా క్లాసికల్ డాన్స్ పాటల పోటీలు నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిలుగా సినీ హీరోలు సంపూర్ణేశ్ బాబు, సంజోష్, కూల్ సురేష్, మెర్క్యురీ సత్య, ఆధ్యాత్మిక ప్రవచనకర్త వీరం బట్లయ్యస్వామి, వీరపాండ్య కట్టబ్రహ్మన వంశీయులు ఇలయ కట్టబ్రహ్మన, లయన్ వీజీ జయకుమార్, శివాజీ రవి తదితర ప్రముఖులు పాల్గొంటారని, ఈ సంబరాల్లో సభ్యులందరూ పాల్గొనవచ్చని టీటీపీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు దేవరకొండ రాజు ఓ ప్రకటనలో తెలిపారు.

12 వరకు వర్ష సూచన

● వాతావరణ శాఖ వెల్లడి

అడయార్, జనవరి 6: లక్ష్యద్వీప్, దానిపరసర ప్రాంతం, నైరుతి బంగాళాఖాతంపై ఆవహించివున్న బాహ్య ఉపరితల ద్రోణి కారణంగా ఈనెల 12వ తేదీ వరకు వర్ష సూచన ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ విషయంపై శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. నీలగిరి, కోయంబత్తూరు, తిరుపూరు, తేని, దిండిగల్, మదురై, విరుదునగర్, తెన్‌కాశి, తూత్తుక్కుడి, తిరునెల్వేలి, కన్నియాకుమారి ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షానికి అవకాశం ఉందని తెలిపింది. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా కడలూరు, విల్లుపురం, పుదుచ్చేరి ప్రాంతాల్లో భారీ వర్షం, తిరువళ్లూరు, చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువణ్ణామలై, రాణిపేట, కళ్ళకుర్చి, మైలాడుదురై ప్రాంతాల్లో భారీ వర్షానికి అవకాశం ఉందని తెలిపింది.

అన్నదానం హాలు నిర్మాణాలకు సాయిల్ టెస్ట్



మట్టి పరిశోధనలో అధికారులు

వేలూరు, జనవరి 6: కాట్పాడిప తాలూకా వళ్లిమలై సమీపం సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తుల కోసం అన్నదానం హాలు నిర్మించాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. నిర్మాణ ప్రాంతంలో సాయిల్ టెస్ట్ చేపట్టారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి, అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ప్రజాపనుల శాఖ ఇంజనీర్ రాధ, ఆలయ మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్ల దాడి

ప్యారీస్, జనవరి 6: తిరువొత్తియూర్‌లో ఎక్స్‌ప్రెస్ రైలుపై రాళ్లతో దాడికి పాల్పడి పరారైన గుర్తుతెలియని వ్యక్తుల కోసం ఆర్పీఎఫ్ పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై సెంట్రల్ - మైసూరు మధ్య కావేరి ఎక్స్‌ప్రెస్‌ను నడుపుతున్నారు. శుక్రవారం రాత్రి మైసూరు నుంచి బయల్దేరిన రైలు శని వారం తెల్లవారుజామున 2.15 గంటలకు తిరువొత్తియూర్ చేరుకున్న సమయంలో చీకట్లో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన రాళ్ల దాడిలో ఏడు బోగీలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై లోకో పైలెట్ అందజేసిన ఫిర్యాదుతో తిరువొత్తియూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

రైల్వే ఆసుపత్రిలో కాంట్రాక్ట్ సహాయకుల నియామకం

● హైకోర్టు స్టే

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో సహాయకులను నియమించడాన్ని నిలుపుదల చేస్తూ మద్రాసు హైకోర్టు స్టే విధించింది. రైల్వే యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించిన 202 మంది సహాయకులను పర్మనెంట్ చేయాలని కోరుతూ దక్షిణ రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో దాఖలు చేసిన పిటిషన్‌ను సెంట్రల్ ట్రిబ్యునల్ గత డిసెంబర్ 19న తోసిపుచ్చుతూ ఉత్తర్వు జారీ చేసింది. ఆ 202 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించి, వారి స్థానంలో కొత్త కార్మికులను నియమించడానికి రైల్వే యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు కాంట్రాక్టు కార్మికుల నియామకంలో యథాపూర్వస్థితి కొనసాగాలంటూ డిసెంబర్ 20న ఉత్తర్వు జారీ చేసింది. ఇదిలా ఉండగా కొత్తగా ఎంపిక చేసిన కాంట్రాక్టు కార్మికులకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొంటూ ఆ నియామకాలపై స్టే విధించాలని దక్షిణ రైల్వే ఉద్యోగుల సంఘం తరఫున పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ పై న్యాయమూర్తులు సురేష్‌కుమార్, కుమరేష్‌బాబుతో కూడిన హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. పాత కార్మికులను తొలగించి కొత్త కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించడంపట్ల ధర్మాసనం నిరసన వ్యక్తం చేసింది. రైల్వే ఆసుపత్రుల్లో కొత్తగా కాంట్రాక్టు కార్మికులను సహాయకులు నియమించకూడదంటూ స్టే జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి మూడో వారానికి వాయిదా వేసింది.

ఘనంగా ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణ సభలో జేఎం నాయుడు, ఇతర సభ్యులు

ప్యారీస్, జనవరి 6: నగరంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో తెలుగులో ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరణ శనివారం ఘనంగా జరిగింది. కొరట్టూరు అగ్రహారంలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 200 మందికి పైగా పేదలకు అన్న ప్రసాదం వినియోగించారు. అనంతరం స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు సారథ్యంలో జరిగిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ సభలో సలహాదారులు ఎమ్మెస్ మూర్తి, సెక్రటరి జనరల్ జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14న సంక్రాంతి సంబరాలు.. : ఈనెల ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంధ్ర కళ స్రవంతి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. శ్రీ కోదండ రామాలయ ప్రాంగణం వేదికగా ముగ్గులు, వంటల పోటీలు, కోలాటం, హరిదాస్ పాటలు, గంగిరెద్దు విన్యాసం తదితర సాంస్కృతిక వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంక్రాంతి పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 10వ తేదిలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా స్రవంతి అధ్యక్షుడు జేఎం నాయుడు పేర్కొన్నారు.

బాల్య వివాహ రహిత భారత్ లక్ష్యం

● కొవ్వొత్తులతో విద్యార్థుల ప్రతిజ్ఞ



కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్యారీస్, జనవరి 6: బాల్య వివాహ రహిత భారత్‌గా అవతరించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుతూ చెన్నైలోని పలు పాఠశాలల విద్యార్థులు శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన, ప్రతిజ్ఞ చేశారు. చిన్నారులు, మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తూ సైబర్ క్రైం, ఐసీడబ్ల్యూఓ, ఎన్‌సీసీ, సీఎస్‌ఎస్, ఎన్‌ఎస్‌ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఎగ్మూర్‌లోని యతిరాజ్ మహిళా కళాశాల ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జి.వనతి, రిటైర్డ్ పోలీసు అధికారి పీఎం నాయర్, డాక్టర్ ఉమా గౌరి, మురళిధరన్, ఏజే హరిహరన్ సహా విద్యార్థినులు పాల్గొన్నారు.

కోలాహలంగా మారథాన్



మారథాన్ పోటీల్లో విద్యార్థులు

వేలూరు, జనవరి 6: జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మారథాన్ కోలాహలంగా జరిగింది. మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చేపట్టిన ఈ మారథన్‌ను జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ ప్రారంభించారు. కాట్పాడిలోని వీఐటీ వర్శిటీ సమీపంలో ప్రారంభమైన మారథాన్ చిత్తూర్ బస్టాండ్ వరకు వెళ్లి, అక్కడి నుంచి మళ్లీ వర్శిటీ సమీపంలో ముగిసింది. ఈ పోటీల్లో ముగ్గురు విజేతలకు రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు బహుమతులు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

పామును బంధించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది



వేలూరు, జనవరి 6: ఇంట్లో ప్రవేశించిన పామును అగ్నిమాపక శాఖ సిబ్బంది బంధించారు. పేర్నాంబట్టు సమీపం ఎరుకమ్‌పట్టుకి చెందిన తన ఇంట్లో శనివారం ఉదయం సుమారు 5 అడుగుల పామును గుర్తించి వెంకటేశ్ వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని పామును బంధించి మోర్ధానా అటవీ ప్రాంతంలో వదలిపెట్టారు.

కోర్టు నుంచి పారిపోయిన ఖైదీ

అడయార్, జనవరి 6: తిరువారూర్ జిల్లా తిరుత్తురైపూండి కోర్టు నుంచి ఖైదీ పారిపోయారు. తిరుత్తురైపూండికి చెందిన గురుమారన్ (23) అనే నిందితుడిని కేసు విచారణ నిమిత్తం శనివారం సాయంత్రం తిరుత్తురైపూండి కోర్టుకు తీసుకొచ్చారు. ఆ సమయంలో భద్రతగా ఉన్న రాజేష్ అనే పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసి తప్పించుకుని పారిపోయాడు. దీనిపై భద్రతా సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

జిల్లా పంచాయతీ కమిటీ సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న కమిటీ అధ్యక్షుడు బాబు

వేలూరు, జనవరి 6: స్థానిక అన్నాసాలైలోని పంచాయతీల కమిటీ కార్యాలయంలో శనివారం కమిటీ అధ్యక్షుడు బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై తీర్మానాలు చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాపారుల భద్రతకు ప్రత్యేక చట్టం

● తమిళనాడు వ్యాపారుల సంఘ సమాఖ్య డిమాండ్



ధర్నాలో పాల్గొన్న వ్యాపారులు

ప్యారీస్, జనవరి 6: వ్యాపారుల భద్రతకు ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టాలని తమిళనాడు వ్యాపారుల సంఘ సమాఖ్య డిమాండ్ చేసింది. ఇటీవల చెన్నైలో మామూలు చెల్లించేందుకు నిరాకరించిన ఓ వ్యాపారిని దారుణంగా హతమార్చిన వ్యవహారాన్ని ఖండిస్తూ శనివారం ఉదయం స్థానిక ఎగ్మూర్‌లోని రాజరత్తినం స్టేడియం సమీపంలో నిర్వహించిన ధర్నాలో సుమారు 500 మందికి పైగా వ్యాపారులు పాల్గొన్నారు. సమాఖ్య అధ్యక్షుడు ముత్తుకుమార్, కార్యదర్శి కేసీరాజా, కోశాధికారి పొన్నుస్వామి, అరుణ్‌కుమార్, జయబాలన్ తదితరులు మాట్లాడుతూ... బాధిత వ్యాపారి కుటుంబానికి రూ.కోటి పరిహారం, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు వ్యాపారుల భద్రత నిమిత్తం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

పెరుందురైలో అంబులెన్స్ దగ్ధం



దగ్ధమైన అంబులెన్స్

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా పెరుందురై వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద నిలిపి ఉంచిన అంబులెన్స్ ఉన్నట్టుండి మంటలు చెలరేగి దగ్ధమైంది. పెరుందురైలోని ప్రైవేటు కళాశాల హాస్టల్‌లో బసచేస్తున్న విద్యార్థి అస్వస్థతకు గురికావటంతో శుక్రవారం రాత్రి కళాశాలకు చెందిన అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆ విద్యార్థి చికిత్సలందుకుని కోలుకున్న తర్వాత శనివారం ఉదయం అంబులెన్స్‌లో అతడిని తరలించేందుకు సిబ్బంది సిద్ధమయ్యారు. ఆ సమయంలో ఉన్నట్టుండి అంబులెన్స్ నుంచి నిప్పురవ్వలు వెలువడి క్షణాలలో మంటలు వ్యాపించాయి. ఊహించని ఆ సంఘటనలతో అంబులెన్స్ సిబ్బంది పరుగెత్తుకెళ్ళి అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. అగ్నిమాపక దళం సభ్యులు ఆ ప్రాంతానికి చేరుకునేలోగా ఆ అంబులెన్స్ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

జోయలుక్కాస్‌లో 'బ్రిలియన్స్ బిగ్ జ్యువెలరీ షో'





ఆధునికీకరించిన షోరూంను ప్రారంభిస్తున్న సినీ ప్రముఖులు నటులు త్యాగరాజన్, ప్రశాంత్ తదితరులు

అడయార్, జనవరి 6: సరికొత్త డిజైన్లు, ఆవిష్కరణలో కొత్త ఒరవడిని కలిగి, సెంట్రిక్ అనుభవాలకు పర్యాయపదంగా మారిన ప్రముఖ వజ్రాభరణాలు, నగల దుకాణం జోయలుక్కాస్‌ను సరికొత్తగా హంగులతో ఆధునికీకరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'బ్రిలియన్స్ బిగ్ జ్యువెలరీ షో'ను ప్రముఖ సీనియర్ సినీ నటుడు త్యాగరాజన్, హీరో ప్రశాంత్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు శనివారం సాయంత్రం ప్రారంభించారు. టి.నగర్, నార్త్ ఉస్మాన్ రోడ్డులో ఉన్న ప్రశాంత్ గోల్డ్ టవర్ మొదటి, రెండు అంతస్తుల్లో జోయలుక్కాస్ షోరూం ఉండగా, అంతర్జాయతీయ ట్రెండ్‌లపట్ల నిబద్ధతతో ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని పెంపొందించుకోవాలనే అభిరుచి, మార్గనిర్దేశంతో తమ ఖాతాదారులకు ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఆభరణాలను ఇక్కడ ప్రదర్శన, విక్రయానికి ఉంచారు. ఆభరణ ప్రియుల అభిరుచికి అనుగుణంగా ప్రతిభావంతులైన డిజైనర్లు, కళాకారులు రూపొందించిన తాజా కలెక్షన్లు ఉన్నాయి. ఈ సందర్భంగా జోయలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ... నిరంతరం మారుతున్న కాలానికి అనుగుణంగా, అంతర్జాతీయ ట్రెండ్‌ల కంటే ముందంజలో ఉండగల సామర్థ్యంతో తమ ప్రయాణం సాగుతోందన్నారు. తాజాగా చెన్నై షోరూంకు సరికొత్త రూపాన్ని చేకూర్చామన్నారు. 'బ్రిలియన్స్' ప్రదర్శనను తిలకించడానికి ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. తమ సంస్థ 11 దేశాల్లో 160 షోరూంలను కలిగి ఉందన్నారు. జోయలుక్కాస్ సృజనాత్మక, శ్రేష్ఠత, అచంచలమైన అంకితభావానికి నిదర్శనంగా ఆభరణాల రంగంలో సరికొత్త డిజైన్లను ఆవిష్కరిస్తూ, కొనుగోలుదారుల మన్ననలను పొందుతోందని పేర్కొన్నారు.

నేటినుంచి మైలాపూర్, మందవెల్లిలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, జనవరి 6: మెట్రోరైలు పనుల కారణంగా స్థానిక మైలాపూర్, మందవెల్లి ప్రాంతాల్లో ఆదివారం నుంచి ట్రాఫిక్ మార్పులు చేపట్టినట్లు చెన్నై ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు.

అజంతా జంక్షన్-ఆర్కే రోడ్డు నుంచి రాయపేట హైరోడ్డు వరకు...

- జీఆర్‌హెచ్ పాయింట్ నుంచి అజంతా జంక్షన్ మీదుగా ఆర్కే రోడ్డుకు వచ్చే వాహనాలు వీపీ రామన్ రోడ్డు - జంబులింగం వీధి- ఆర్కే రోడ్డు మీదుగా మళ్లించనున్నారు.
- రాయపేట హైరోడ్డు నుంచి జీఆర్‌హెచ్ మీదుగా వచ్చే వాహనాలు రాయపేట బ్రిడ్జి సర్వీస్ రోడ్డు - నీల్‌గిరీస్ దుకాణం - మ్యూజిక్ అకాడమీ సర్వీస్ రోడ్డు - టీటీకే రోడ్డు - గౌడియా మఠం రోడ్డు వరకు వెళ్లవచ్చు.
- అజంతా జంక్షన్ నుంచి అన్నాడీఎంకే పార్టీ కార్యాలయం మీదుగా ఇండియన్ బ్యాంక్ జంక్షన్ వరకు భారీవాహనాలకు నిబంధనలువిధించారు.
- వీపీ రామన్ రోడ్డు-వీఎం వీధి - న్యాయమూర్తి జంబులింగం వీధులు వన్‌వేగా మార్చారు.

ఆర్కే మఠం రోడ్డు, లజ్ జంక్షన్ నుంచి మైలాపూర్ ఎమ్మార్‌టీఎస్ వరకు...

- ఆర్కే రోడ్డు, రాయపేట హైరోడ్డు నుంచి లజ్ జంక్షన్ మీదుగా మందవెల్లి జంక్షన్‌వచ్చే వాహనాలు లజ్‌జంక్షన్‌లో దారిమళ్లించనున్నారు. అనంతరం లజ్ చర్చి రోడ్డు- డిసిల్వా రోడ్డు - భక్తవత్సలం వీధి - వారస్ రోడ్డు - సెయింట్ మెరీస్ రోడ్డు, సీపీ రామస్వామి రోడ్డు మీదుగా వెళ్లాలి.
- ఆర్కే మఠం రోడ్డు నుంచి రాయపేట హైరోడ్డు మీదుగా వచ్చే వాహనాలు వెంకటేశ అగ్రహారం వీధి - రంగా రోడ్డు - ఈస్ట్ అభిరామి పురం 1వ వీధి - లజ్ అవెన్యూ - బీఎస్ శివస్వామి రోడ్డు - సులివన్ గార్డెన్ వీధి - రాయపేట హైరోడ్డు మీదుగా వెళ్లాలి.
- ఈస్ట్ మాడ వీధి, వెంకటేశ అగ్రహారం వీధి, డాక్టర్ రంగా రోడ్డు నుంచి ఈస్ట్ అభిరామపురం 1వ వీధి, ముండగ కన్నియమ్మన్ ఆలయ వీధులు వన్‌వేగా మార్చారు.
- సీపీ ఆలయ జంక్షన్ నుంచి ఆర్కే మఠం రోడ్డు జంక్షన్, ఉత్తర మాడ వీధి వరకు టూవేగా మార్చారు.
- మైలాపూర్ నుంచి ఆర్కే మఠం రోడ్డు మీదుగా బయల్దేరే మినీ బస్సులు మందవెల్లి పోస్టాఫీసు- మందవెల్లి వీధి - నార్టన్ రోడ్డు - సౌత్ కెనాల్ రోడ్డు మీదుగా వెళ్లాలి.

ఆర్కే మఠం రోడ్డు తిరువేంకటం వీధి జంక్షన్ నుంచి గ్రేస్ సూపర్ మార్కెట్ వరకు...

- వారెన్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు, సెయింట్ మేరీస్ రోడ్డు - సీపీ రామస్వామి రోడ్డు- కాళియప్ప జంక్షన్ - ఆర్‌ఏ పురం 3వ క్రాస్ వీధి - కామరాజర్ రోడ్డు - శ్రీనివాస అవెన్యూ - గ్రీన్‌వేస్ జంక్షన్ మీదుగా ఆర్కే మఠం రోడ్డు వెళ్లాలి.
- గ్రీన్‌వేస్ జంక్షన్ నుంచి మందవెల్లికి వచ్చే వాహనాలు ఆర్కే మఠం రోడ్డు - తిరువెంకటం వీధి - వీకే అయ్యర్ రోడ్డు - దేవనాథన్ వీధి - సెయింట్ మేరీస్ రోడ్డు- ఆర్కే మఠం రోడ్డు మీదుగా వెళ్లాలి.
- మందవెల్లి వెళ్లే ప్రభుత్వ బస్సులు వారెన్ రోడ్డు - సెయింట్ మేరీస్ రోడ్డు - శృంగేరి మఠం రోడ్డు- వీకే అయ్యర్ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- శ్రీనివాస అవెన్యూ, తిరువేంకటం వీధి - స్కూల్ రోడ్డు వీధులు వన్‌వేగా మార్చారు.

తిరువణ్ణామలై ఆలయంలో.... ఉత్తరాయణ పుణ్యకాల వేడుకలు ప్రారంభం

అడయార్, జనవరి 6: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్తరాయణ పుణ్యకాల వేడుకలు శనివారం నుంచి ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ ఆలయంలో ప్రతి వేడుకను ధ్వజారోహణంతో ప్రారంభించడం ఆనవాయితీ. యేటా నాలుగు సార్లు ఈ ఆలయంలో ధ్వజారోహణ వేడుక జరుగుతుంది. కార్తీక మహాదీపం, ఆని బ్రహ్మోత్సవం, మార్గళి మాసంలో ఉత్తరాయణ పుణ్యకాల వేడుకలు, ఆలయ వార్షిక వేడుకల సమయంలో ధ్వజారోహణ వేడుక జరుగుతుంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 5.30 గంటలకు ఉత్తరాయణ పుణ్యకాల వేడుకలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వినాయకుడు, అన్నామలై, ఉన్నామలై అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేసి, మాడ వీధుల్లో ఊరేగించారు.

అదృశ్యమైన బాలికను 24 గంటల్లో గుర్తించిన పోలీసులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

వేలూరు, జనవరి 6: అదృశ్యమైన బాలికను 24 గంటల్లో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. స్థానిక సీఎస్ఐ హోంలో ఉన్న బాలిక శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి కనిపించడంలేదని కేంద్ర నిర్వాహకులు వేలూరు దక్షిణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు 24 గంటల్లో బాలికను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు.

జింకను వేటాడిన ఇద్దరి అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

వేలూరు, జనవరి 6: కేవీకుప్పం తాలూకా లత్తేరి సమీపం పళమతంగి కాపు అడవుల్లో జింకలను వేటాడుతున్నట్లు అటవీ శాఖ అధికారి కళానిధికి సమాచారం అందించారు. ఆయన ఉత్తర్వులతో రేంజర్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది అరుణ, తనికవేలు, జయసుధ, శంకర్ తదితరులు శనివారం వేకువజామున 3 గంటలకు కీల్‌ముట్టుకూరు సమీపం చెన్నిరాయన్‌పల్లి అమ్మన్‌గుట్టలో గస్తీ పనులు చేపట్టారు. ఆ సమయంలో వేటాడిన జింకతో ద్విచక్ర వాహనంలో వస్తున్న విరింజిపురం సమీపం బెదువాలై ప్రాంతానికి చెందిన కార్తీ, సంజయ్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి నాటు తుపాకి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై లైంగిక వేధింపులు
యువకుడికి ఏడేళ్ల జైలు

ప్యారీస్, జనవరి 6: బాలిక(13)పై లైంగిక వేధింపులకు పాల్పడిన పెరుమాళ్ అనే యువకుడికి న్యాయస్థానం ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. గత 2018 ఆగస్టు 2వ తేది ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు యువకుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తయిన నేపథ్యంలో, పోక్సో కోర్టు న్యాయమూర్తి తమిళరసి శుక్రవారం, నిందితుడికి ఏడేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలవరిం చారు. అంతేకాకుండా, బాధిత కుటుంబానికి రూ.లక్ష పరిహారం అందజేయా లని న్యాయస్థానం ఆదేశించింది.

22 వేలమంది ఉత్సాహంగా పాల్గొన్న మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

ప్యారీస్, జనవరి 6: చెన్నై రన్నర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నైలో శనివారం ఉదయం నిర్వహించిన మారథాన్‌లో సుమారు 22,000 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, మాజీ డీజీపీ శైలేంద్రబాబు, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని జెండా ఊపి ఈ పోటీలు ప్రారంభించారు. మెరీనా బీచ్ సమీపంలో ఉన్న నేపియర్ వంతెన నుంచి ప్రారంభమైన మారథాన్ నాలుగు విభాగాలుగా సాగింది.

కోర్టుకు హాజరైన మాజీ మంత్రి విజయభాస్కర్

అడయార్, జనవరి 6: అక్రమార్జన కేసులో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి విజయభాస్కర్ పుదుక్కోట జిల్లా కోర్టులో శనివారం హాజరు కాగా, తదుపరి విచారణను న్యాయమూర్తి ఈనెల 11వ తేదీకి వాయిదా వేశారు. ప్రస్తుతం విరాలిమలై అన్నాడీఎంకే ఎమ్మెల్యేగా ఉన్న విజయభాస్కర్... గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఎనిమిదేళ్లపాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఆదాయానికి మించి రూ.35.79 కోట్ల ఆస్తులు సంపాదించినట్టు కేసు నమోదై ఉండగా, ఈ కేసు పుదుక్కోట జిల్లా కోర్టులో సాగుతోంది. ఈ కేసుపై శనివారం విచారణ జరగ్గా, ఈ మాజీ మంత్రి విజయభాస్కర్ మాత్రమే హాజరయ్యారు. ఆయన భార్య రమ్య హాజరుకాలేదు. దీంతో ఈ కేసు తుదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.


తిరునల్వేలి సైన్స్‌సెంటర్‌కు బాంబు బెదిరింపు



మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేస్తున్న బాంబ్‌స్క్వాడ్

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26 సైన్స్ సెంటర్లకు బాంబు బెదిరింపు ఈమెయిల్ సందేశాలు రావ డంతో తిరునల్వేలి సైన్స్‌సెంటర్‌లో ఆదివారం ఉదయం బాంబ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తిరునల్వేలిలో మాత్రమే సైన్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌కు కూడా బాంబు బెదిరింపు రావటంతో ఉదయం నుంచి నిపుణులు, రాష్ట్ర పోలీసు సాంకేతిక నిపుణులు కలిసి ఆ సెంటర్ భవనంలోని అన్ని గదులలోను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలలో ఎక్కడా బాంబులు లేవని అధికారులు నిర్ధారించారు. అదే సమయంలో ఆ సెంటర్ వద్ద సాయుధ పోలీసులతో భద్రత కల్పించారు.

తిరువికనగర్‌లో అభివృద్ధి పనుల తనిఖీ



తిరువిక నగర్‌లో పాడైన గడియార స్తంభాన్ని పరిశీలిస్తున్న మేయర్ ప్రియ

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువికనగర్ జోన్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మేయర్ ఆర్ ప్రియ శనివారం ఉదయం పరిశీలించారు. ఒట్టేరి సుబ్బరాయ వీధిలోని గడియార స్తంభాన్ని పరిశీలించారు. కొత్త గడియారాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ప్రిస్లీ నగర్‌లో రహదారుల నిర్మాణ పనులను, జ్యోతి నగర్‌లో కాల్వ తవ్వకాలను తనిఖీ చేశారు. కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎస్ రాజేంద్రన్, జోనల్ కమిటీ ఆఫీసర్ ఎఎస్ మురుగన్ పాల్గొన్నారు.



చెన్నై ఐలాండ్ గ్రౌండ్స్‌లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించనున్న చెన్నై సంగమం వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న తమిళభాషాభివృద్ధి, సమాచార శాఖల మంత్రి సామినాథన్



టి.నగర్‌లోని తనను మర్యాదపూర్వకంగా కలుసుకున్న తెలుగు ప్రముఖుడు పీజే ప్రవీణ్‌కు పార్టీ క్యాలెండర్‌ను కానుకగా ఇస్తున్న డీఎంకే శాసనసభ్యుడు జే కరుణానిధి. పక్కనే డీఎంకే డివిజన్ సభ్యుడు లక్ష్మీకాంతన్

అలనాడే మేక్ ఇన్ మద్రాస్ నినాదం



ఆసియా తొలి విమాన రూపశిల్పి

ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' నినాదం 114 ఏళ్ల క్రితమే మద్రాసు నగరంలో హోరెత్తిందంటే నమ్మగలరా? ఈ నినాదం కారణంగా ప్రయోగాత్మక దృష్టితో సొంతంగా మొదటి విమానాన్ని, సముద్రంలో నడిచే విమానాలు, చోళవరంలో మోటరు రేసింగ్, మొదటి కారు వంటివి మన సొంతమయ్యాయి. ఆ విధంగా మద్రాసు మహానగరం దక్షిణాదిలో ఎన్నో తొలి ఆవిష్కరణలకు చిరునామాగా మారింది. ఆ వివరాలేంటో ఒక్కసారి చూద్దాం..!


- టి.నగర్

ఆసియాలో మొదటి విమానం...

రైట్ సోదరుల తొలి విమాన మహత్తర ఆవిష్కరణ జరిగిన 7 సంవత్సరాల తర్వాత, మద్రాసులో రెండు రెక్కల విమానం ప్రదర్శించబడింది. 1906 నాటికి కార్సికస్ బేకర్ అయిన డి.ఏంజెలిస్ మద్రాసులో అత్యుత్తమ హోటల్ నడుపుతున్నాడు. ఏంజెలిస్ కూడా రైట్ సోదరుల్లాగే ఎగరాలని కలలు కన్నాడు. విమానం ఎలా నిర్మించబడుతుందనే అంశాలపై ఆయన వద్ద వార్తాపత్రికల కథనాలు, ప్రకటనలు తదితరాలు సేకరించారు. అనంతరం తనదైన శైలిలో విమానం రూపొందించి విజయవంతంగా నడిపాడు. డి ఏంజెలిస్ 1910 మార్చి కూవం మధ్యలో ఉన్న ద్వీపంలో తన ఆవిష్కరణను ప్రజలు చూసేందుకు ఏర్పాటు చేశాడు. ఓ వ్యక్తి ఎగరబోతున్నాడన్న వార్త దావానంలా వ్యాపించడంతో భారీగా జనం గుమిగూడారు. స్థానిక వార్తాపత్రికలు ఈ ప్రదర్శనను విస్తృతంగా నివేదించాయి. అలాగే, బాలసుబ్రమణ్య భారతి సంపాదకత్వంలో వెలువడే 'ఇండియా' వార్తాపత్రిక కూడా దీని గురించి రాసింది.

సముద్ర విమానాలు...

సింగపూర్ జపనీస్ చేతిలో ఓడిపోయింది. దీంతో బ్రిటిష్ వారికి బ్యాకప్ ఎయిర్‌బేస్ అవసరం కావడంతో అత్యంత రహస్యమైన ఆపరేషన్‌లో భాగంగా, బ్రిటిష్ సామ్రాజ్యపు అతిపెద్ద సైనిక స్థావరం ఒకటి ఆవడిలో 20 చ.మై విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడింది. ఆవడి నుంచి వైమానిక దళానికి చెందిన విమానాలు కార్గో, గస్తీ సేవలు కొనసాగించేవి. ఎయిర్‌పోర్ట్ ఇరుకుగా ఉండడంతో సరస్సులు సెకండరీ రన్‌వేలుగా ఉపయోగించబడ్డాయి. అత్యవసర పరిస్థితుల్లో విమాన సేవలకు సరస్సులను వినియోగించడంతో లోతట్టు ప్రాంతాలు అభివృద్ధి చెందాయి.



నీటిలో నడిచే విమానం

చోళవరంలో మోటర్ రేసింగ్...

యుద్ధం ముగింపుతో ఉపయోగించకుండా వదిలేసిన ఎయిర్‌ఫోర్స్ స్ట్రిప్స్ రన్‌వేలు సర్క్యూట్ రోడ్లుగా మారాయి. నేటి రెడ్‌హిల్స్ సరస్సు పక్కన చోళవరం ఎయిర్ ఫోర్స్ బేస్ ఉండేది. 1953 నుంచి 1989 వరకు ఈ బేస్ దేశవ్యాప్తంగా అగ్రశ్రేణి డ్రైవర్లను ఆకర్షించే మోటరు రేసులను నిర్వహించింది. లిక్కర్ వ్యాపారి విజయ్ మల్యా ఇక్కడ జరిగిన చివరి రేసుల్లో 1,600 సీసీ రేసుతో పాటు ఇతర కారు రేసుల్లోనూ పలుమార్లు గెలిచాడు. 1960 ఫిబ్రవరిలో జరిగిన రేసులకు 40 వేలమంది హాజరయ్యారు. ఈ రేసులను దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ పందేలు ఎంత ప్రాచుర్యం పొందాయంటే ముఖ్యమంత్రి ఎంజీఆర్ స్వయంగా ఈ రేసులకు 3 సార్లు హాజరయ్యేంతగా. కాలగమనంలో రేసులు ఇరుంగాట్టుకోటకు మారాయి. రేసులు జరిగిన రన్‌వే మార్గాలను తిరిగి ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం తీసుకుంది.

1966 నవంబరు నుంచి...

వాతావరణ శాస్త్రపరంగా, 1966 నవంబరు నెల చెన్నైకి ఓ చేదు జ్ఞాపకంగా మిగలడం మొదలైంది. 1966లో మద్రాసు రెండు తుఫానుల బారిన పడింది. వాటిలో ఒకటి ప్రళయాన్ని సృష్టించింది. ఈ తుఫానుల గాలికి రామేశ్వరం ప్యాసింజర్ రైలు కూడా పట్టాల నుంచి పక్కకు నెట్టబడింది. మద్రాసు ఓడరేవులో, బల్క్ క్యారియర్ మారి, స్టామటిస్ ఓడలు కరువు బాధితులకు హోరా గోధుమ తీసుకొచ్చినా తుఫాను గాలులకు వాటి లంగర్లు విచ్చినమై, మెరీనా తీరం దగ్గర కూవం నది ముఖద్వారం వద్దకు నెట్టివేయబడ్డాయి. తుఫాను తగ్గిన పది రోజుల తర్వాత, ఓడను ఇసుకలో నుంచి బయటకు తీయడానికి ప్రయత్నించారు కానీ, ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇక చేసేది లేక వాటి యజమానులు ఓడను చెక్క, ఇనుప తుక్కుగా విక్రయించారు. కానీ వాటి శిథిలాలు పూర్తిగా తొలగించకపోయారు. దశాబ్దాలుగా అంటే 1990 వరకు ఓడ శిథిలాలు ఈతగాళ్లకు మృత్యుకూపాలుగా మారాయి. వీటిని చాలా దగ్గరగా ఈదుకుంటూ వచ్చిన వారు వాటి తప్పుపట్టిన పదునైన ఉక్కు దూలాలు, చువ్వలకు తగులుకొని చనిపోయేవారు. 1983 సంక్రాంతి సమయంలో ఇలాంటి 19 మృతదేహాలు తీరానికి కొట్టుకొచ్చాయి. అలా నవంబరులో ఏదో ఒక తుఫాను మద్రాసు నగరాన్ని వణికించడం ప్రారంభమైంది. కాలక్రమేణా మద్రాసు ప్రజలకు నవంబరు మాసం తుపానుల నెల అనే బలమైన నమ్మకంగా మారిపోయింది.

SUNDAY SPECIAL

నౌకాశ్రయం...


వర్తక పట్టణమైన మద్రాసుకి వచ్చే ఓడలు తీరానికి చేరకపోవడం వల్ల జార్జి కోట స్థాపకుడు ఫ్రాంక్స్ డే, కోట ఎంపిక ప్రదేశంలో ఘోరమైన తప్పు చేశాడనే ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. 1769 వారెన్ హేస్టింగ్స్ కాలంలో రేవు నిర్మాణ ప్రతిపాదన చేసినప్పటికీ, 200 సంవత్సరాల వరకు నౌకాశ్రయం ఏర్పాటుకాలేదు. మద్రాసు నుండి 2 మైళ్ల దూరంలో ఉన్న భారీ ఇసుక గట్టు నగరానికి చేరుకొనే ఓడలను ధ్వంసం చేస్తుందని తెలిసినా కానీ అది ఔత్సాహిక ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రయత్నాలను ఆపలేకపోయింది. షిప్ యార్డ్ అనే ఓడ రేవు నిర్మాణం చురుగ్గా కొనసాగింది. నిర్మాణంలో మనుషులు, యంత్రాలతో పాటు గజరాజులు కూడా పాలుపంచుకున్నాయి. చాలా సార్లు తుఫానుల కారణంగా నిర్మాణాలు కొట్టుకుపోయాయి. కానీ చివరకు యార్డు పని పూర్తయి, నేడు మద్రాస్ దేశంలోనే అతి లోతైన నౌకాశ్రయంగా పేరుగాంచింది.

ఆటోమొబైల్స్...

కోల్‌కతాలో మొదటి భారతీయ కారు వచ్చిన నాలుగు సంవత్సరాల తర్వాత 1901లో మద్రాసులో ఒక కారు సాధారణ ప్రజా రవాణా వినియోగంలోకి వచ్చింది. ఆ కారు ఎవరిదో కాదు అప్పటి ప్యారీ అండ్ కో డైరెక్టర్లలో ఒకరైన ఏజే యోర్కేది. అతడు తన కారును రోజూ నేటి రాయపురంలోని బెన్స్ గార్డెన్ నుంచి బ్లాక్ టౌన్‌లోని ప్యారీస్‌కి వయా మౌంట్ రోడ్డు మీదుగా వ్యాపార పంథాలో నడిపారు. ఈ రకంగా యార్క్ దక్షిణ దేశంలోని తొలి అద్దె కారు ఆధారిత సేవలు అందించే క్యాబ్ వ్యాపారిగా చరిత్రలో నిలిచారు. కార్ల అధికారిక రిజిస్ట్రేషన్లు ప్రారంభమైన తర్వాత, దక్షిణాదిలో నమోదైన తొలి రిజిస్ట్రేషన్ కారు పేరు ఎంసీ-1. ఇది మద్రాస్ రైల్వే బోర్డు కార్యదర్శి, మద్రాస్ హార్బర్‌కు బాధ్యత వహించే వ్యక్తి అయిన ఫ్రాన్సిస్ స్ప్రింగ్‌కు చెందినది కావడం గమనార్హం.
అప్పటి మద్రాసు నగరంలో తెలుగు కోమటి అయిన టి.నంపెరుమాళ్ చెట్టి అత్యంత సంపన్న భవన నిర్మాణ కాంట్రాక్టర్. మద్రాస్‌లోని తెలుగు సమాజంలో మొట్టమొదటి కారు యజమానిగా నంపెరుమాళ్ ఎంసీ-3 అనే మోడల్ కారుకి యజమాని అయ్యాడు. కార్ల దిగుమతులతో ఆగకుండా మద్రాసు నగరం తొలి భారతీయ కారు కూడా తయారుచేసింది. సింప్సన్ వద్ద క్యారేజ్ బిల్డింగ్ సూపర్‌వైజర్ శామ్యూల్ జాన్ గ్రీస్ ఆవిరితో నడిచే కారును అభివృద్ధి చేశారు. ఇది భారతదేశంలో తయారు చేయబడిన మొదటి కారు. కార్లు నడిపేవారు థ్రిల్ పొందినపుడు అవి పాదచారులను, పశువులను ఢీకొనడంతో ప్రమాదాలు జరిగేవి. ఆ రోజుల్లో ఒక కారు ఎగ్మూర్ వంతెన రక్షణ బారికేడ్లను కూడా బద్దలుకొట్టి కూవం నదిలో పడిపోవడం పెద్ద వార్తగా నిలిచింది.




చోళవరం కారు రేసులో ఎంజీఆర్



బైక్ రేసులు

ఎగ్మూర్ బ్రిడ్జిపైన యాక్సిడెంట్ చేసిన తొలి దక్షిణాది కారు





పోర్ట్ నిర్మాణ పనుల్లో ఏనుగులు

తొలిసారి సంక్రాంతి రేసులో అరుణ్ విజయ్ చిత్రం

● 12న 'మిషన్ చాప్టర్-1' విడుదల

దాదాపు రెండు దశాబ్దాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న హీరో అరుణ్ విజయ్ నటించిన చిత్రం తొలిసారి సంక్రాంతి పండుగకు విడుదలవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన 'మిషన్ చాప్టర్-1' ఈనెల 12న విడుదల చేస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం చెన్నైలో ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రంలో అరుణ్ విజయ్ సరసన నిమిషా సజయన్ నటించగా, బాలీవుడ్ నటి అమీ జాక్సన్ జైలర్ పాత్రను పోషించారు. 'తలైవి' ఫేం ఏఎల్ విజయ్ దర్శకుడు. హీరో అరుణ్ విజయ్ మాట్లాడుతూ... 'కొన్ని పరిస్థితుల కారణంగా లండన్ జైలులో చిక్కుకుంటాను. నా కుమార్తెకు కీలక ఆపరేషన్ చేయాల్సిన నిర్బంధ పరిస్థితి. ఈ జైలు నుంచి నేను తప్పించుకున్నానా? లేదా? అన్నదే ఫుల్‌లెంగ్త్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాం. ఎమీ జాక్సన్ జైలర్‌గా, నిమిషా సజయన్ నర్సుగా నటించారు. 'లియో' చిత్రంలో నటించిన ఇయల్ ఇందులో నా కుమార్తెగా నటించారు. సింహ భాగం షూటింగ్ లండన్‌లో చిత్రీకరించాం. చెన్నైలో 4 ఎకరాల విస్తీర్ణంలో కోట్ల రూపాయల వ్యయంతో భారీ జైలు సెట్‌ను నిర్మించి కీలక సన్నివేశాలు చిత్రీకరించాం. ఇందులో పలువురు విదేశీ నటులు ఖైదీలుగా నటించారు. మూవీలో యాక్షన్‌తో పాటు ఎమోషన్, కుమార్తె ప్రేమ ఉంటుంది. ఇన్నేళ్ల కెరీర్‌లో నేను నటించిన చిత్రం సంక్రాంతికి రిలీజ్ కావడం ఇదే తొలిసారి' అని అన్నారు. దర్శకుడు విజయ్ మాట్లాడుతూ... 'ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించాను. కానీ, ఈ మూవీ సరికొత్త అనుభవాన్ని మిగిల్చింది. అరుణ్ విజయ్ అంటేనే యాక్షన్. అందుకే కథా రచయిత మహాదేవన్ స్క్రిప్టుకు అతన్ని ఎంచుకున్నాం. ఇప్పటివరకు నేను తీసిన చిత్రాలకు ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది' అన్నారు. అలాగే, జీవీ ప్రకాష్, నటులు భరత్ గోపన్న, శరవణన్, అభిహాసన్, విరాజ్ తదితరులు ప్రసంగించారు.



విలేకరుల సమావేశంలో జీవీ ప్రకాష్, అరుణ్ విజయ్, విజయ్ తదితరులు

'హనుమాన్'తో కలిసి సంక్రాంతిని జరుపుకుందాం

● నిర్మాత శక్తివేలన్

'హనుమాన్'తో కలిసి సంక్రాంతి పండుగను ప్రేక్షకులు జరుపుకోవాలని ప్రముఖ నిర్మాత, శక్తి ఫిలిమ్స్ అధినేత శక్తివేలన్ కోరారు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై శ్రీమతి చైతన్య సమర్పణలో నిర్మాత కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన చిత్రం 'హనుమాన్'. ఈ నెల 12న సంక్రాంతిని పురస్కరించుకుని విడుదల చేస్తున్నారు. తేజ సజ్జా, అమృత అయ్యర్ జంటగా నటించగా, విలన్‌గా వినయ్‌రాయ్ నటించారు. వరలక్ష్మి శరత్ కుమార్ ముఖ్య పాత్రను పోషించారు. ప్రశాంత్‌వర్మ దర్శకుడు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, మరాఠీ, ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, జపనీస్, చైనీస్ భాషల్లో పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కించారు. అనుదీప్ దేవ్, హరిగౌడ, కృష్ణ సౌరభ్ సంగీతం అందించారు. శుక్రవారం రాత్రి చెన్నైలో చిత్ర బృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. హీరో తేజ సజ్జా మాట్లాడుతూ... 'ఈ సినిమా డైరెక్ట్ తమిళ్ మూవీలా ఉంటుంది. ట్రైలర్ చూస్తే ఈ సినిమా క్వాలిటీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఇది పూర్తిగా ఒక ఫిక్షనల్ మూవీ. ఇందు కోసం 'అంజనాద్రి' అనే యూనివర్సల్ వరల్డ్‌ను సృష్టించాం. ఒక యువకుడికి హనుమంతుడి వల్ల అతీత శక్తులు లభించడమే ఈ చిత్ర కథ' అని అన్నారు. హీరోయిన్ అమృత అయ్యర్ మాట్లాడుతూ... 'నిజానికి ఈ సినిమాను తెలుగులోనే ప్లాన్ చేశారు. ఆ తర్వాత పాన్ వరల్డ్ మూవీగా మారిపోయింది. దీనికి కారణం హనుమాన్ ఆశీర్వాద బలమే. భారతీయ చిత్రపరిశ్రమ గర్వపడేలా ఈ మూవీ ఉంటుంది' అని అన్నారు. వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ... 'మన దేశంలోనే తొలిసారి తెరకెక్కిన సూపర్ హీరో చిత్రం. ట్రైలర్ కంటే ఎన్నో రెట్లు కొత్తగా ఉంటుంది. కొన్ని సినిమా విజ్యువల్స్‌ను థియేటర్లలోనే చూడాలి' అని అన్నారు.



విలేకరుల సమావేశంలో 'హనుమాన్' చిత్ర బృందం

కెప్టెన్ నివాసానికి క్యూకడుతున్న సినీ ప్రముఖులు

తమిళ చిత్రపరిశ్రమలో మానవతావాదిగా గుర్తింపుపొందిన సీనియర్ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు కెప్టెన్ విజయకాంత్ గత నెల 28న అనారోగ్యం కారణంగా మృతి చెందగా, ఆయన అంత్యక్రియల్లో వేళ్లపై లెక్కించదగిన సంఖ్యలోనే సినీ ప్రముఖులు పాల్గొన్నారు. విజయ్ వంటి అగ్రహీరో ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. అయితే, కెప్టెన్ అంత్యక్రియల్లో సినీ ప్రముఖులు పాల్గొనలేదు. అలాగే, పలువురు చెన్నైలో ఉన్నప్పటికీ అంత్యక్రియలకు దూరంగా ఉన్నారు. కానీ, ఇపుడు కోయంబేడులోని ఆయన సమాధి వద్దకు, సాలిగ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళి అర్పిస్తున్నారు. ఇలాంటి వారిపై సినీ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. మనిషి చనిపోయినపుడు వెళ్లి కడచూపు చూసి కుటుంబ సభ్యులను ఓదార్చాల్సిన నటీనటులు ఇపుడు సమాధి వద్దకు క్యూ కట్టడాన్ని తప్పుబడుతున్నారు. కెప్టెన్ సమాధి వద్దకు వెళ్లిన వారిలో శరత్ కుమార్, శశికుమార్, శివకుమార్, సూర్య, కార్తీ, జయం రవి, అరుణ్ విజయ్, కన్నడ నటుడు శివ రాజ్ కుమార్, నటి ఐశ్వర్య రాజేష్, దర్శక నటుడు ఎస్ఏ చంద్రశేఖర్ ఇలా అనేక మంది ఉన్నారు.

కెప్టెన్ చిత్ర పటానికి శివకార్తికేయన్ దంపతుల నివాళి



'ఇసైజ్ఞాని' అనే పేరుకు అర్హుడినా?

● ఇళయరాజా ప్రశ్న

చిత్రజ్యోతి

తనను 'ఇసైజ్ఞాని' అని పిలుస్తుంటారని, నిజానికి ఆ పేరుకు తాను అర్హుడినా అంటే తనకే ప్రశ్నార్థకంగా ఉంటుందని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా అన్నారు. చెన్నైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'నాకు భాష, సాహిత్య పరిజ్ఞానం లేదు. నేను తొలిసారి దర్శకత్వం వహించిన చిత్రంలో హీరోయిన్ నడిచి వచ్చే సన్నివేశానికి నేపథ్య సంగీతం అందించాను. ఆ హీరోయిన్‌లో ఆండాళ్‌ను చూశాను. అందుకేనేమో ఆ ఆండాళ్ ఆశీర్వాదం లభించినట్టుగా భావిస్తాను. నేను శివ భక్తుడిని. కానీ, ఏ ఒక్కదానికి వ్యతిరేకం కాదు. కర్ణాటక సంగీతాన్ని ఔపోసన పట్టలేదు. కానీ, ప్రజలు నన్ను ఇసైజ్ఞాని అని పిలుస్తున్నారు. నేను అలా భావించడం లేదు. గర్వాన్ని చిన్న వయసులోనే వదిలేశా. అన్నతో కలిసి కచేరిలకు వెళ్లే సమయంలో హార్మోనియం వాయించేవాడిని. ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ అభినందించేవారు. ఆ సమయంలో ఎంతో గర్వంగా ఉండేది. ఆ తర్వాత సాధన చేసి అనేక చిత్రాలకు వాయించాను. కొంతకాలానికి ఈ అభినందనలు నాకు కాదు నేను సృష్టించే బాణీలకు ఈ కరతాళధ్వనులు వస్తున్నాయని తెలుసుకున్నా. మనకు ఏ విషయంతో సంబంధం లేదని గ్రహించాను. అందుకే పేరు ప్రఖ్యాతల గురించి ఆలోచించడం మానేశా' అని అన్నారు.



లక్షకు పైగా పేజీలున్న పుస్తకం

ఎంబీబీఎస్ విద్యార్థిని గిన్నిస్ రికార్డు

చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీబాలాజీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి కె.మధుమిత మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు సహా వివిధ అంశాలపై వ్యాసాలు, రచనలు ఉన్న లక్షకుపైగా పేజీలు కలిగిన గ్రంథాన్ని రూపొందించి గిన్నిస్ రికార్డు నెలకొల్పింది. ఆ సందర్భంగా ఆ కళాశాల నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తమిళ మహాకవి భారతియార్ మునిమనుమరాలు డాక్టర్ ఉమా భారతి, ఈఎస్ఎన్ పబ్లికేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జే బాలచందర్, ఈఎంజీ యాదవ ఉమెన్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సి. రమ్య, శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ ఎండీ ఎన్ ఎలమారన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ భూమినాధన్, డీన్ డాక్టర్ పి. సతీష్‌కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ గుణశేఖరన్, అడ్వయిజర్ డాక్టర్ ఆర్ వీరబాహు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు. మధుమిత రూపొందించిన ఈ గ్రంథంలో వైద్య, ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ విభాగాలకు చెందిన పరిశోధనాత్మక వ్యాసాలు కూడా ఉన్నాయి. 7332 మంది రచయితలకు సంబంధించిన వ్యాసారాలు, 170 మంది సంపాదకులు సంపాదకీయాలు చోటుచేసుకున్నాయి. ఇంతటి మందపాటి పుస్తకాన్ని రూపొందించి గిన్నిస్ రికార్డును సాధించి మధుమిత తమ కళాశాలకు అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని కలిగించిందని కళాశాల నిర్వాహకులు ప్రశంసించారు. ఈ పుస్తకాన్ని నగరంలో అన్నా సెంటినరీ లైబ్రరీలో ప్రదర్శనకు ఉంచనున్నట్లు పేర్కొన్నారు.



మధుమితను సత్కరిస్తున్న మహాకవి భారతియార్ మునిమనుమరాలు డాక్టర్ ఉమాభారతి, కళాశాల నిర్వాహకులు

పురుషులు మాత్రమే పాల్గొన్న మాంసాహార విందు

● తిరుమంగళంలో సందడి

ప్యారీస్, జనవరి 6: మదురై జిల్లా తిరుమంగళం అనుపపట్టిలోని కరుంబరై ముత్తయ్య స్వామి ఆలయంలో మార్గళి మాసం సందర్భంగా కోలాహలంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పురుషులు మాత్రమే పాల్గొన్నారు. తరతరాలుగా ఈ ఆలయం ఆధ్వర్యంలో జరుపుకొనే మార్గళి ఉత్సవంలో శిశువులు సహా మహిళలను ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు అనుమతించరు. తిరుమంగళం, కరడికల్, పున్నంపట్టి, అనుపపట్టి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తమ కులదైవం కరుంబరై ముత్తయ్యస్వామికి మొక్కుబడిగా చిన్న గొర్రెపిల్లలను కానుకగా సమర్పిస్తుంటారు. ఈ గొర్రెలు ఆలయ ప్రాంగణంలోనే పెంచి పోషిస్తుంటారు. ఈ క్రమంలో, శుక్రవారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక పూజల్లో 62 గొర్రెలు స్వామివారి సన్నిధి ముందు బలిచ్చారు. అనంతరం వాటి మాంసం, 85 బస్తాల బియ్యంతో వండిన అన్నాన్ని స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణంలో వరుసగా కూర్చున్న మగవారికి అరిటాకులో మాంసాహారాన్ని వడ్డించారు. కాగా, వచ్చే ఏడాది నిర్వహించనున్న ఉత్సవం కోసం చిన్న గొర్రెపిల్లలను ఆలయ ప్రాంగణంలో మొక్కుబడిగా సమర్పించడం గమనార్హం.



మాంసాహారం విందులో పాల్గొన్న మగవారు